www.aksharadarbar.com
గురువారం 04, జూలై 2024
అక్షర దర్బార్
voice of the people
తెలుగు దినపత్రిక వరంగల్ | సంపుటి :02 | సంచిక :130 | పేజీలు : 05 | వెల : 05

భేటీకి వేళాయే..

- 6న తెలుగు రాష్ట్రాల సీఎంల కీలక సమావేశం
- హైదరాబాద్ లోని ప్రజాభవన్ వేదికగా చంద్రబాబు, రేవంత్ రెడ్డి భేటీ..
- ఏర్పాట్లు చేస్తోన్న అధికార యంత్రాంగం
- ఎజెండా సిద్ధం చేస్తున్న తెలంగాణ ప్రభుత్వం
- ఇరు రాష్ట్రాల మధ్య కొనసాగుతున్న విభజన అంశాలకు త్వరలోనే పరిష్కారం ?
- ఢిల్లీలో ప్రధాని మోడీని కలిసిన రేవంత్ రెడ్డి, మల్లు భట్టి విక్రమార్క
- తెలంగాణ అభివృద్ధికి సహకరించాలని విన్నపం
- మోడీతోపాటు కేంద్ర మంత్రి గడ్కరీతో చంద్రబాబు చర్చలు
- రెండు తెలుగు రాష్ట్రాల్లో ఆసక్తిరేపుతున్న పరిణామాలు

2

చంద్ర బాబుతో రేవంత్ రెడ్డి భేటీ అంశం రెండు తెలుగు రాష్ట్రాల్లో సర్వ త్రా ఆసక్తి రేపుతోంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారం కోసం రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఈనెల 6న హైదరాబాద్ లోని ప్రజాభవన్ లో భేటీ కానున్నారు. ఇద్దరు ముఖ్యమంత్రుల కీలక సమావేశానికి అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేస్తోంది. సమావేశంలో చర్చించాల్సిన ఎజెండాను తెలంగాణ ప్రభుత్వం సిద్ధం చేస్తోంది. రెండు రాష్ట్రాలు షేర్ చేసుకోవాల్సిన ఉమ్మడి ఆస్తులతోపాటు తెలంగాణ స్వాధీనం చేసుకోవాల్సిన ఆస్తులపైనా ఇప్పటికే మంత్రులు ఆయా శాఖల అధికారులతో చర్చించారు. ముఖ్యంగా రోడ్లు, భవనాల శాఖకు సంబంధించి ఏపీ ఆధీనంలో ఉన్న ఆస్తులను స్వాధీనం చేసుకుంటామని మంత్రి కోమటిరెడ్డి ఇప్ప టికే స్ప ష్టంచేశారు. ఈ క్రమంలోనే ఇవాళ చంద్రబాబు, రేవంత్ రెడ్డి ఢిల్లీలో ప్రధాని మోడీని వేర్వేరుగా కలవడం ప్రాధాన్యత సంతరించుకుంది. త్వరలో జరగబోతున్న తెలంగాణ, ఏపీ ముఖ్యమంత్రుల భేటీ సఫలం అవుతుందా ? పదేళ్లుగా పెండింగ్ లో ఉన్న సమస్యలకు పరిష్కారం దొరుకుతుందా ? అన్న అంశం ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లో తీవ్ర ఉత్కంఠ రేపుతోంది.

– అక్షర దర్బార్,
ప్రత్యేక ప్రతినిధి

వరంగల్ అభివృద్ధిపై
ప్రత్యేక దృష్టి

వరంగల్ నగర అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ, వరంగల్ జిల్లా ఇన్ చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. కొద్ది రోజుల క్రితం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన వరంగల్ జిల్లా పర్యటనలో ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అనేక హామీలు ఇచ్చారని, ఈ నేపథ్యంలో ప్రభుత్వ ప్రాధాన్యతలను దృష్టిలో పెట్టుకుని వరంగల్ నగర అభివృద్ధి పనులను యుద్ధ ప్రతిపాదికన చేపట్టాలని అధికారులను ఆయన ఆదేశించారు. వరంగల్ నగర అభివృద్ధిపై గురువారం సచివాలయంలోని తన కార్యాలయంలో వరంగల్ జిల్లా మంత్రులు కొండా సురేఖ, దనసరి అనసూయ సీతక్క, ముఖ్యమంత్రి ప్రధాన సలహాదారు వేం నరేందర్ రెడ్డితో కలిసి సుధీర్ఘంగా ఆరు గంటలపాటు సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రధానంగా ఉమ్మడి వరంగల్ జిల్లా అభివృద్ధి, ఐఆర్ఆర్ భూసేకరణ, ఓఆర్ఆర్ అలైన్ మెంట్, వరంగల్ మాస్టర్ ప్లాన్, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ, కుడా మాస్టర్ ప్లాన్, కాళోజీ కళాక్షేత్రం, జీడబ్ల్యూఎంసీ పరిధిలో రిటైనింగ్ వాల్ ల నిర్మాణం, వరద నివారణ చర్యలు, ఇంకుడు గుంతల, కాళోజి కళాక్షేత్రం నిర్మాణ పనులు, నర్సంపేట మెడికల్ కాలేజీ తదితర అంశాలపై చర్చించారు.

- అక్షర దర్బార్, హైదరాబాద్

- వరద ముప్పు నుంచి నగరానికి విముక్తి కల్పిస్తాం
- యుద్ధ ప్రతిపాదికన అభివృద్ధి పనులు
- వీలైనంత త్వరగా 2050 మాస్టర్ ప్లాన్
- కాళోజీ జయంతికి కళాక్షేత్రం రెడీ
- సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ పనుల్లో వేగం పెంచాలి
- నిర్దేశించిన గడువులోగా పనులు చేయాల్సిందే
- ఆర్ఓబీ నిర్మాణ పనులపై తీవ్ర అసంతృప్తి
- ప్రజా ప్రతినిధులు, అధికారులతో జిల్లా ఇన్ చార్జ్ మంత్రి పొంగులేటి ఆరు గంటలు సమీక్ష

2

విశ్వ విజేతకు
గ్రాండ్ వెల్ కం

- భారత్ కు చేరుకున్న క్రికెట్ జట్టుకు అపూర్వ స్వాగతం
- రోహిత్ సేనకు ప్రధాని మోదీ అభినందనలు
- ముంబైలో విక్టరీ పరేడ్ కు తరలివచ్చిన అభిమానులు

04

హామీని నిలబెట్టుకున్న
గొప్పవ్యక్తి చంద్రబోస్

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు | పుట్టిన ఊరిలో రూ.36లక్షలతో ఆస్కార్ లైబ్రరీ ఏర్పాటు

3



భేటీకి వేళాయే..

- 6న తెలుగు రాష్ట్రాల సీఎంల సమావేశం
- హైదరాబాద్‌లోని ప్రజాభవన్ వేదికగా చంద్రబాబు, రేవంత్‌రెడ్డి భేటీ..
- ఏర్పాట్లు చేస్తున్న అధికార యంత్రాంగం
- ఎజెండా సిద్ధం చేస్తున్న తెలంగాణ ప్రభుత్వం
- ఇరు రాష్ట్రాల మధ్య కొనసాగుతున్న విభజన అంశాలకు త్వరలోనే పరిష్కారం ?
- ఢిల్లీలో ప్రధాని మోడీని కలిసిన రేవంత్‌రెడ్డి, మల్లు భట్టి విక్రమార్క
- తెలంగాణ అభివృద్ధికి సహకరించాలని విన్నపం
- రెండు తెలుగు రాష్ట్రాల్లో ఆసక్తిరేపుతున్న పరిణామాలు

- అక్షర దర్బార్, ప్రత్యేక ప్రతినిధి

చంద్రబాబుతో రేవంత్‌రెడ్డి భేటీ అంశం రెండు తెలుగు రాష్ట్రాల్లో సర్వత్ర ఆసక్తి రేపుతోంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారం కోసం రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఈనెల 6న హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో భేటీ కానున్నారు. ఇద్దరు ముఖ్యమంత్రుల కీలక సమావేశానికి అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేస్తోంది. సమావేశంలో చర్చించాల్సిన ఎజెండాను తెలంగాణ ప్రభుత్వం సిద్ధం చేస్తోంది. రెండు రాష్ట్రాలు షేర్ చేసుకోవాల్సిన ఉమ్మడి ఆస్తులతోపాటు తెలంగాణ స్వాధీనం చేసుకోవాల్సిన ఆస్తులపైనా ఇప్పటికే మంత్రులు ఆయా శాఖల అధికారులతో చర్చించారు. ముఖ్యంగా రోడ్లు, భవనాల శాఖకు సంబంధించి ఏపీ ఆధీనంలో ఉన్న ఆస్తులను స్వాధీనం చేసుకుంటామని మంత్రి కోమటిరెడ్డి ఇప్పటికే స్పష్టంచేశారు. ఈ క్రమంలోనే ఇవాళ చంద్రబాబు, రేవంత్‌రెడ్డి ఢిల్లీలో ప్రధాని మోడీని వేర్వేరుగా కలవడం ప్రాధాన్యత సంతరించుకుంది. త్వరలో జరగబోతున్న తెలంగాణ, ఏపీ ముఖ్యమంత్రుల భేటీ సఫలం అవుతుందా ? పదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న సమస్యలకు పరిష్కారం దొరుకుతుందా ? అన్న అంశం ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లో తీవ్ర ఉత్కంఠ రేపుతోంది.

ఎక్కడి ఆస్తులు అక్కడే ..

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రెండుగా విడిపోయి పదేళ్లు దాటింది. 2014లో విభజన జరిగినా.. ఇప్పటికీ సమస్యలు అలాగే ఉన్నాయి. మొన్నటి వరకు ఉమ్మడి రాజధానిగా ఉంటూ వచ్చిన హైదరాబాద్ కాల పరిమితిసైతం ముగిసిపోయింది. ఈ ఏడాది జూన్ 2వ తేదీతో పరిపాలనపరంగా హైదరాబాద్‌తో ఏపీకి ఉన్న సంబంధాలు తెగిపోయాయి. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలో పొందుపరిచిన మెజారిటీ అంశాలు పరిష్కారానికి నోచుకోవట్లేదు. ఎక్కడి ఆస్తులు అక్కడే ఉన్నాయి. వాటి విలువ సుమారు లక్షన్నర కోట్ల రూపాయలుంటుని అంచనా. ఈ విభజన సమస్యలను పరిష్కరించడానికి కేంద్ర ప్రభుత్వం కూడా పెద్దగా ఆసక్తి చూపట్లేదు. గతంలో కేంద్ర కేబినెట్ కార్యదర్శి రాజీవ్ గౌబా.. రెండు, మూడుసార్లు ఇరు రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులతో సమావేశం అయ్యారు. కానీ సమస్యలు పెద్దగా కొలిక్కి రాలేదు. విభజన చట్టాన్ని సవాల్ చేస్తూ పలు పిటీషన్లు సుప్రీంకోర్టులో దాఖలవడం గమనార్హం. ఈక్రమంలోనే ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు భేటీ కానుండటంపై సర్వత్ర ఆసక్తి నెలకొంది. మరోపక్క ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రుల భేటీని బీజేపీ, బీఆర్ఎస్, తెలంగాణ జన సమితి తదితర పార్టీల నాయకులు స్వాగతించారు. రెండు రాష్ట్రాల ప్రజల సమస్యలపై చర్చించడం మంచి పరిణామమని పలువురు నేతలు పేర్కొంటున్నారు. చర్చలు సఫలీకృతం కావాలని ఆకాంక్షిస్తున్నారు.

మోడీతో రేవంత్, చంద్రబాబు కీలక చర్చలు

సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఢిల్లీలో ప్రధాని నరేంద్ర మోదీతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఈ సమావేశంలో ప్రధానికి పలు కీలక విజ్ఞప్తులు చేసినట్లు డిప్యూటీ సీఎం వెల్లడించారు. మోదీతో పాటుగా కేంద్రం హోంశాఖ మంత్రి అమిత్ షాతో కూడా చర్చలు జరిపినట్లు భట్టి తెలిపారు. తెలంగాణకు 25 లక్షల ఇళ్లు మంజూరు చేయాలని, తెలంగాణలోని బొగ్గు గనులను సింగరేణికి కేటాయించాలని ప్రధాని మోదీకి విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. రాష్ట్రానికి ఐఎంఎం ఇవ్వాలని కోరడంతో పాటుగా గత ప్రభుత్వ హయాంలో రిలీజ్ అయిన ఐటీఆర్ ప్రాజెక్టును కూడా పునరుద్ధరించాలని కోరినట్లు వెల్లడించారు. అదేవిధంగా ఈనెల 6న హైదరాబాద్‌లో జరుగనున్న ఇద్దరు ముఖ్యమంత్రుల భేటీపైనా చర్చించినట్లు సమాచారం. అదే విధంగా ఢిల్లీలో ఏపీ సీఎం చంద్రబాబు పర్యటన బిజీబిజీగా కొనసాగుతోంది. ప్రధాని నరేంద్ర మోదీతోపాటు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని చంద్రబాబు కలిశారు. ఈసందర్భంగా పెండింగ్ సమస్యలతోపాటు విభజన సమస్యలపై వారితో చర్చించినట్లు సమాచారం.

పెండింగులో ఉన్న అంశాలివే...

ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలోని తొమ్మిదో షెడ్యూల్‌లో ఉన్న ఆర్టీసీ, రాష్ట్ర ఆర్థిక సంఘం తదితర 23 కార్పొరేషన్ల ఆస్తులపై రెండు రాష్ట్రాల మధ్య ఏకాభిప్రాయం కుదరలేదు. పదో షెడ్యూల్‌లోని తెలుగు అకాడమీ, అంబేద్కర్, తెలుగు విశ్వవిద్యాలయం వంటి 30 సంస్థల ఆస్తులు, సేవలపై కూడా భిన్నాభిప్రాయాలున్నాయి. రాజ్‌భవన్, హైకోర్టు, లోకాయుక్త, కార్మిక సంక్షేమ నిధి, వాణిజ్య పన్నులు, విద్యుత్ సంస్థల బకాయిలపైనా వివాదాలున్నాయి. రెండు రాష్ట్రాల అధికారులతో కేంద్ర హోం శాఖ పలు సమావేశాలు నిర్వహించినప్పటికీ సమస్యలు పరిష్కారం కాలేదు. ముఖ్యమైన చిక్కులను ముఖాముఖి చర్చలతో పరిష్కరించుకోవాల్సిన అవసరం ఉందని ఏపీ సీఎం చంద్రబాబు చొరవ చూపడంతో రెండు రాష్ట్రాల మధ్య ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న విభజన సమస్యలు కొలిక్కి రావచ్చని ఇరు రాష్ట్రాలు ఆశిస్తున్నాయి.

వరంగల్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

- వరద ముప్పు నుంచి నగరానికి విముక్తి కల్పిస్తాం
- యుద్ధ ప్రతిపాదికన అభివృద్ధి పనులు
- వీలైనంత త్వరగా 2050 మాస్టర్ ప్లాన్
- కాళోజీ జయంతికి కళాక్షేత్రం రెడీ
- సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ పనుల్లో వేగం పెంచాలి
- నిర్దేశించిన గడువులోగా పనులు చేయాల్సిందే
- ఆర్‌ఓబీ నిర్మాణ పనులపై తీవ్ర అసంతృప్తి
- ప్రజా ప్రతినిధులు, అధికారులతో జిల్లా ఇంఛార్జి మంత్రి పొంగులేటి ఆరు గంటలు సమీక్ష

అక్షర దర్బార్, హైదరాబాద్: వరంగల్ నగర అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ, వరంగల్ జిల్లా ఇంఛార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. కొద్ది రోజుల క్రితం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన వరంగల్ జిల్లా పర్యటనలో ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అనేక హామీలు ఇచ్చారని, ఈ నేపథ్యంలో ప్రభుత్వ ప్రాధాన్యతలను దృష్టిలో పెట్టుకుని వరంగల్ నగర అభివృద్ధి పనులను యుద్ధ ప్రతిపాదికన చేపట్టాలని అధికారులను ఆయన ఆదేశించారు. వరంగల్ నగర అభివృద్ధిపై గురువారం సచివాలయంలోని తన కార్యాలయంలో వరంగల్ జిల్లా మంత్రులు కొండా సురేఖ, దనసరి అనసూయ సీతక్క, ముఖ్యమంత్రి ప్రధాన సలహాదారు వేం నరేందర్ రెడ్డిలతో కలిసి సుధీర్ఘంగా ఆరు గంటలపాటు సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రధానంగా ఉమ్మడి వరంగల్ జిల్లా అభివృద్ధి, ఐఆర్ఆర్ భూసేకరణ, ఓఆర్ఆర్ అలైన్ మెంట్, వరంగల్ మాస్టర్ ప్లాన్, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ, కుడా మాస్టర్ ప్లాన్, కాళోజీ కళాక్షేత్రం, జీడబ్ల్యుఎంసీ పరిధిలో రిటైనింగ్ వాల్ ల నిర్మాణం, వరద నివారణ చర్యలు, ఇంకుడు గుంతల, కాళోజి కళాక్షేత్రం నిర్మాణ పనులు, నర్సంపేట మెడికల్ కాలేజీ తదితర అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో మంత్రి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణలో హైదరాబాద్ తర్వాత వరంగల్ అతి పెద్ద నగరమని, ఈ నగరాన్ని హైదరాబాద్ కు దీటుగా అభివృద్ధి పరిచేలా ప్రభుత్వం అడుగులు వేస్తోందని అన్నారు. 2050 వరకు జనాభా పెరుగుదలకు అనుగుణంగా వరంగల్ నగర అవసరాలకు

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రులు

సరిపోయేలా మాస్టర్ ప్లాన్ ను తయారు చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ఈ మాస్టర్ ప్లాన్ లో ఫార్మా సిటి, ఐటి సర్వీసెస్, మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్స్, ఎకొ టూరిజం, ఎడ్యుకేషనల్ ఇన్సిట్యూషన్స్, స్టేడియం, ఎయిర్ పోర్టు, లాజిస్టిక్స్ పార్కు, టూరిజం, ఖమ్మం– వరంగల్, కరీంనగర్–వరంగల్ రహదారిలో డంపింగ్ యార్డుల ఏర్పాటు వంటి అంశాలు ప్రధానంగా ఉండేలా మాస్టర్ ప్లాన్ ను తయారుచేయాలని అధికారులను ఆదేశించారు.

- చర్యలకు వెనకాడబోము

ప్రభుత్వం ప్రతిపాదించిన ప్రతి ప్రాజెక్టు కు సంబంధించిన డీపీఆర్ లను త్వరితగతిన తయారు చేయాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా పనులు పూర్తి చేయకపోతే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవడానికి ఏ మాత్రం వెనకాడబోమని హెచ్చరించారు. వరంగల్ నగరంలో నిర్మించే రింగ్ రోడ్డు జాతీయ రహదారులకు కనెక్టివిటీ ఉండేలా చూడాలని, అలాగే భూసేకరణను త్వరగా చేపట్టాలని సూచించారు.

సెప్టెంబర్ 9న సీఎం

సెప్టెంబర్ 9న కాళోజీ జయంతి సందర్భంగా కాళోజీ కళాక్షేత్రాన్ని సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభిస్తారని, పెండింగ్ పనులను పూర్తి చేయాలన్నారు. నర్సంపేటలోని మెడికల్ కాలేజీ కార్యకలాపాలు ఈ ఏడాది నుంచి ప్రారంభించడానికి ఉన్న సాధ్యసాధ్యాలను పరిశీలించాలని ఆరోగ్య శాఖ కార్యదర్శి డా. క్రిస్టినా చొంగ్తుని ఆదేశించారు. వరంగల్ సూపర్ స్పెషాలిటీ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని సూచించారు. కాజీపేట అయోధ్యాపురం ఆర్‌ఓబీ నిర్మాణ పనుల ఆలస్యంపై మంత్రి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.

- స్పెషల్ డ్రైవ్

వరంగల్ నగరం వరద ముప్పుకి గురి కాకుండా, వరద నీరు సాఫీగా వెళ్లడానికి నాలాలను విస్తరించాలని ఇందుకోసం స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలన్నారు. డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (డీఆర్ఎఫ్) బలోపేతం చేయాలని ఇందుకు అవసరమైన సిబ్బందిని రెవెన్యూ శాఖ నుండి సమకూరుస్తామని తెలిపారు. నాలాలు, చెరువులు ఆక్రమణకు గురి కావడం వల్లే తరచూ వరంగల్ నగరం వరద ముప్పుకు గురవుతుందని అన్నారు. ఈ నాలాలు అక్రమణకు గురి కాకుండా చర్యలు తీసుకోవాలని, ఈ నాలాలను ఆక్రమించుకుని అక్కడ నివాసం ఉంటున్న వారిని తక్షణమే మరో ప్రాంతానికి తరలించాలని, ఈ సమయంలో మానవతా దృక్పథంతో వ్యవహరించి పేదప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా వారికి ఇండ్లు, ఇండ్ల స్థలాలను ఇవ్వాలని అన్నారు. కొత్తగా నాలాలు అక్రమణకు గురికాకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

- అందుబాటులో ఉండాలి

వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రభలకుండా గ్రామీణ ప్రాంతాలలో పేద ప్రజలకు వైద్య సేవలు అందేలా డాక్టర్లను అందుబాటులో ఉంచాలన్నారు. వరంగల్ ఎంజిఎం హాస్పిటల్ లో గతంలో కంటే వసతులను మెరుగుపరచాలను వైద్య అధికారులను సూచించారు. ఈ సమావేశంలో వరంగల్ జిల్లా ప్రజా ప్రతినిధులు వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు కడియం కావ్య, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, రేవూరి ప్రకాష్ రెడ్డి, దొంతి మాధవ రెడ్డి, కేఆర్ నాగరాజు, ఎమ్మెల్సీలు బండ ప్రకాష్, పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, బస్వరాజు సారయ్య, వరంగల్ మేయర్ శ్రీమతి గుండు సుధారాణి, మున్సిపల్ శాఖ కార్యదర్శి శ్రీ దాన కిశోర్, ఆరోగ్య శాఖ కార్యదర్శి డా. క్రిస్టినా చొంగ్తు, రోడ్లు, భవనాల శాఖ కార్యదర్శి హరిచందన , సీడీఎంఏ విపి గౌతమ్, వరంగల్, హన్మకొండ జిల్లాల కలెక్టర్లు డాక్టర్ సత్య శారదా, పి. ప్రావీణ్య, వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ డాక్టర్ అశ్వినీ తానాజీ వాఖేడే, సంబంధిత శాఖల ఉన్నత అధికారులు అధికారులు పాల్గొన్నారు.

చల్లగరిగెలో రెండస్తుల గ్రంథాలయం

- రూ.36 లక్షల వ్యయంతో నిర్మాణం
- సినీ గేయ రచయిన చంద్రబోస్ సహకారంతో ఏర్పాటు..
- ప్రారంభించిన ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

అక్షర దర్బార్, జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి : సొంతూరు కోసం ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న గొప్ప వ్యక్తి ఆస్కార్ అవార్డు గ్రహీత, సినీ గేయ రచయిత చంద్రబోస్ అని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. తనకు దక్కిన ఆస్కార్ అవార్డు వస్తే తన గ్రామంలో గ్రంథాలయం ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చి రూ.36 లక్షల వ్యయంతో రెండతస్తుల్లో నిర్మించిన ఆస్కార్ లైబ్రరీని గురువారం చంద్రబోస్ తో కలిసి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పుట్టిన ఊరు కోసం ఇచ్చిన మాట నిలబెట్టుకున్న గొప్ప వ్యక్తి చంద్రబోస్ అని కొనియాడారు. చంద్రబోస్ తన చిన్నతనంలో ఇదే స్థలంలో ఉన్న పాత లైబ్రరీ లోనే చదువుకుని ఈరోజు ఈ స్థాయికి ఎదిగారని హర్షం వ్యక్తం చేశారు. తన వంతుగా లైబ్రరీ కోసం రూ. 10 లక్షలు ఇస్తున్నట్లు ఎమ్మెల్యే ప్రకటించారు. అనంతరం చంద్రబోస్ ను ఎమ్మెల్యే సన్మానించారు. చివరగా ఆర్ఆర్ఆర్ సినిమాలో నాటు నాటు పాట పాడి చంద్రబోస్ సందడి చేశారు.

మంత్రి సీతక్క ఇంటి ముందు నిరాహార దీక్ష చేస్తాం..

బీజేపీ కిషన్ మోర్చా సభ్యుడు జాడి రామరాజు నేత

అక్షర దర్బార్, మంగపేట : ప్రభుత్వం ఏర్పడగానే ఏటూరు నాగారం రెవెన్యూ డివిజన్ ఇంప్లిమెంటేషన్ తో పాటు ఏటూరునాగారం బస్ డిపో ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చి మంత్రి కాగానే హామీలను నెరవేర్చకుండా పబ్బం గడుపుతోందని, హామీలను నెరవేర్చని క్రమంలో మంత్రి సీతక్క ఇంటి ముందు నిరాహార దీక్షకు దిగుతామని బీజేపీ కిషన్ మోర్చా సభ్యుడు జాడి రామరాజు నేత హెచ్చరించారు. ఏటూరునాగారంలో గురువారం బీజేపీ మండల అధ్యక్షుడు గాద్దర్ల రాజశేఖర్ ఆధ్వర్యంలో ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ముఖ్య అతిధిగా రామరాజు నేత హాజరై మాట్లాడుతూ.. ఎమ్మెల్యేగా గెలుపొందడం కోసం ఆదివాసి, దళిత, బహుజన, వర్గాల ప్రజలను నమ్మించి నేడు పంచాయతీరాజ్ శాఖ మంత్రిగా పదవి పొంది హామీలను అమలు చేయకుండా మంత్రి సీతక్క కాలయాపన చేస్తోందని మండిపడ్డారు. హామీలను అమలు చేయకుంటే ఆగస్టు 13న బీజేపీ ఆధ్వర్యంలో మంత్రి ఆఫీస్ ముందు 48 గంటల నిరాహార దీక్ష చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు గండపల్లి సత్యం, దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు వావిలాల జనార్దన్, ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు గద్దం సత్యం, మండల ప్రధాన కార్యదర్శి గద్దల ప్రణయ్, కర్ర సంపత్, యువమోర్చా అధ్యక్షులు రాకేష్, ఓబీసీ మోర్చా అధ్యక్షులు అందకట్ల రమేష్, ఉపాధ్యక్షులు వలస రంజిత్, ప్రధాన కార్యదర్శి లొటపిటల అజిత్, మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి గండేపల్లి రజిని, వలస సతీష్, కొండమల్ల రాకేష్, నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

మాట్లాడుతున్న జాడి రామరాజు నేత

ప్రజాప్రతినిధులను సన్మానిస్తున్న చల్లా ధర్మారెడ్డి

జెడ్పీటీసీ, ఎంపీటీసీలకు ఘనంగా సన్మానం

ప్రజా ప్రతినిధుల సేవలు అభినందనీయం

మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

అక్షర దర్బార్, సంగెం : ఐదేళ్ల పదవీ కాలం ముగిసిన గీసుగొండ, సంగెం మండలాలకు చెందిన జెడ్పీటీసీలు, ఎంపీటీసీలను గురువారం పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి హనుమకొండలోని తన నివాసంలో సన్మానించారు. గత ఐదేళ్లుగా ప్రజాక్షేత్రంలో ఉంటూ ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరవేస్తూ.. గ్రామాల అభివృద్ధిలో ప్రధాన పాత్ర పోషించిన ప్రజాప్రతినిధులను అభినందించారు. పదవులు శాశ్వతం కాదన్నారు. రానున్న రోజుల్లో మరెన్నో ఉన్నతమైన పదవులు అధిరోహించాలని కోరారు. కార్యక్రమంలో గీసుగొండ, సంగెం జెడ్పీటీసీలు పోలీస్ ధర్మారావు, గూడ సుదర్శన్ రెడ్డి, ఎంపీటీసీలు రంగరాజు నరసింహ స్వామి తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ క్రీడాకారులకు ప్రోత్సాహం

- మహిళా పోలీస్ షూటర్ ను అభినందించిన సీపీ

మహిళా పోలీస్ షూటర్ ను సన్మానిస్తున్న సీపీ

అక్షర దర్బార్, హనుమకొండ: ఇటీవల రాష్ట్రస్థాయి మహిళా ఓపెన్ షూటింగ్ చాంపియన్ షిప్‌లో బంగారు పతకాన్ని సాధించిన మహిళా అసిస్టెంట్ సబ్ ఇన్ స్పెక్టర్ సువర్ణను వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా గురువారం అభినందించారు. సుబేదారి పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఏ.ఎస్ఐ సువర్ణ గత నెల 21 నుంచి 28 వరకు హైదరాబాద్‌లోని సెంట్రల్ విశ్వవిద్యాలయంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి మహిళా ఓపెన్ షూటింగ్ చాంపియన్ షిప్ పోటీల్లో 50 మీటర్ల రైఫిల్ ప్రోన్ మాస్టర్స్ విభాగంలో 579 పాయింట్లతో విజయం సాధించి బంగారు పతకాన్ని అందుకుంది. అంతకు ముందు తమిళనాడులో నిర్వహించిన ఆల్ఇండియా పోలీస్ స్పెషల్ మహిళా షూటింగ్ పోటీల్లో పాల్గొని ఐదో స్థానంలో నిలిచింది. క్రీడల్లో రాణించే పోలీస్ క్రీడాకారులకు ప్రోత్సాహం అందిస్తామని సీపీ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ స్పర్జన్‌రాజ్, పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షుడు శోభన్ గౌడ్ పాల్గొన్నారు.

విద్యాసంస్థల బంద్ సంపూర్ణం

నినాదాలు చేస్తున్న విద్యార్థి సంఘం నేతలు

అక్షర దర్బార్, పరకాల: నెట్, నీట్ పరీక్షలు రాసి నష్టపోయిన విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వాలని, పీ హెచ్ డీ అడ్మిషన్ల కోసం ఇటీవల ఆమోదించిన తప్పనిసరి నెట్ స్కోర్ విధానాన్ని వెనక్కి తీసుకోవాలని , పాఠశాలల మూసివేత చర్యలు ఆపాలని , పరీక్షల నిర్వహణను రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పగించాలని ఎస్ఎఫ్ఐ, వామపక్ష ప్రజాస్వామ్య విద్యార్థి యువజన సంఘాల పిలుపుమేరకు గురువారం దేశవ్యాప్త విద్యా సంస్థల బంద్ పరకాల పట్టణం, గ్రామీణ ప్రాంతాల్లో విజయవంతమైనట్లు హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షులు బొచ్చు కళ్యాణ్ తెలిపారు. కార్యక్రమంలో మడికొండ ప్రశాంత్, బొచ్చు ఈశ్వర్, బొజ్జ హేమంత్, కోగిల ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యసభ సభ్యత్వానికి కేకే రాజీనామా..

అక్షర దర్బార్, ఢిల్లీ : బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరిన కే కేశవరావు తన రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేశారు. బుధవారం సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే సమక్షంలో ఆయన కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. దీంతో పార్టీ మారిన ఆయన తన రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు రాజ్యసభ చైర్మన్ జగ్‌దీప్ ధన్కర్ కు లేఖ అందజేశారు. కాగా కేకే రాజీనామాతో ఆ రాజ్యసభ స్థానం కాంగ్రెస్ కు దక్కనున్నట్లు తెలుస్తుంది.

యువత జీవితాలను నాశనం చేసుకోవద్దు

భూపాలపల్లి ఎస్పీ కిరణ్ ఖరే

అక్షర దర్బార్, జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి : గంజాయి సేవించి జీవితాలను నాశనం చేసుకోవద్దని భూపాలపల్లి ఎస్పీ కిరణ్ ఖరే అన్నారు. గురువారం భూపాలపల్లి సబ్ డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో గంజాయి సేవిస్తూ పట్టుబడిన వారికి భూపాలపల్లి పోలీస్ స్టేషన్ ఆవరణలో ఎస్పీ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. జిల్లాలో గంజాయి రవాణా చేసే ముఠాలపై కఠిన చర్యలు తప్పవని, గంజాయి నియంత్రణకు జిల్లా టాస్క్ ఫోర్స్ టీం ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. పదే పదే నేరాలకు పాల్పడుతూ, గంజాయి రవాణా చేస్తూ పట్టుబడితే పీడీ యాక్ట్ నమోదు చేస్తామని ఎస్పీ హెచ్చరించారు. కార్యక్రమంలో డీఎస్పీ సంపత్ రావు, సీఐ నరేష్ కుమార్, చిట్యాల సీఐ మల్లేష్, ఎస్సైలు సుధాకర్, సాంబమూర్తి, రవికుమార్, అశోక్, ప్రసాద్ సిబ్బంది పాల్గొన్నారు.

అక్షర దర్బార్ voice of the people తెలుగు దినపత్రిక

సాఫ్ట్‌వేర్ రంగానికి పెద్దపీట

- విదేశాల్లో స్థిరపడిన తెలంగాణ వ్యక్తులు ముందుకు రావాలి
- ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

అక్షర దర్బార్, హనుమకొండ: విదేశాల్లో స్థిరపడిన తెలంగాణ ప్రాంత వ్యక్తులందరూ ముందుకు వచ్చి ఇక్కడి నగరాల్లో వ్యాపార సంస్థలను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇండస్ట్రీస్ కామర్స్, శాసనసభ వ్యవహార శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కోరారు. గురువారం హనుమకొండలోని రంజిత్ రావుల ఏర్పాటు చేసిన రాక్స్ ఐటీ సొల్యూషన్ ను ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ.. రావుల తన సొంత ప్రాంతం, తన సొంత జిల్లా అనే ఆలోచనతో అమెరికాలో స్థిరపడి వ్యాపారం చేస్తూ ఇక్కడి స్థానికులకు సహాయం చేయాలనే లక్ష్యంతో సంస్థను ఏర్పాటు చేశారని, ఇది చాలా సంతోషకరమైన విషయం అన్నారు. వరంగల్ నగరం కూడా చదువులకు కేంద్రంగా, విజ్ఞానానికి నిలయంగా, అనేక కళాశాలకు పుట్టినిల్లుగా నిలిచిందని, ఇక్కడ ఉన్న మానవ వనరులు అమెరికా లేదా ఇతర ప్రదేశాలకు వెళ్లకుండా వారి ఇంటి వద్దనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు కల్పించాలనే ఉద్దేశంతో ఇక్కడ చిన్న సూక్ష్మ మధ్య తరహా ముఖ్యంగా సాఫ్ట్‌వేర్ రంగానికి పెద్దపీట వేయాలనేది ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. ఆ లక్ష్యంలో భాగంగానే వరంగల్, ఖమ్మం, కరీంనగర్, నిజాంబాద్ వంటి నగరాల్లో పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పిస్తూ ఈ ప్రాంత వాసులకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం నడుస్తుందని మంత్రి పేర్కొన్నారు. ఇక్కడ సంస్థలు ఏర్పాటు చేసే వారికి పూర్తిస్థాయిలో రాష్ట్ర ప్రభుత్వం సహకరిస్తుందని చెప్పారు. మామునూరు విమానాశ్రయ నిర్మాణం పెండింగ్ లో ఉందని, ఈ సమస్యను పరిష్కరించాలని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో హైదరాబాద్ తర్వాత వరంగల్ కు ప్రాధాన్యతను ఇస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, రాక్స్ ఐటీ సొల్యూషన్స్ స్థాపకులు రంజిత్ రావుల, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ర్యాలీలో పాల్గొన్న విద్యార్థి సంఘాల నేతలు

లీకేజీ మాఫియా దోపిడికీ మోడీ వత్తాసు

- పేపర్ లీకేజీలతో నష్టపోతున్న విద్యార్థులు
- న్యాయం చేయకపోతే పార్లమెంటు ముట్టడిస్తాం
- దేశవ్యాప్త విద్యాసంస్థల బంద్ విజయవంతం
- నగరంలో భారీ బైక్ ర్యాలీ

అక్షర దర్బార్, కేయూ క్యాంపస్: దేశంలో పదేళ్ల నుంచి వివిధ పోటీ పరీక్షల పేపర్లు 65 వరకు లీకేజీలు జరిగినప్పటికీ పేపర్ లీకేజీలను అరికట్టి దేశంలోని విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు పూర్తిస్థాయి భరోసా కల్పించడంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విద్యార్థి సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం ఏఐఎస్ఎఫ్, ఎస్ఎస్ యూఐ, పీడీఎస్ యూ, ఎస్ఎఫ్ఐ, యుఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన దేశవ్యాప్త విద్యాసంస్థల బంద్ విజయవంతం చేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి భాష బోయిన సంతోష్, ఎన్ఎస్ యూఐ జిల్లా అధ్యక్షులు పల్లకొండ సతీష్, పీడీఎస్ యూ ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి. నరసింహారావు, ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద శ్రీకాంత్, పీడీఎస్ యు ఉమ్మడి వరంగల్ జిల్లా ఉపాధ్యక్షులు రాచకొండ రంజిత్, యుఎస్ఎఫ్ఐ ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి మాలవత్ రాజేష్, పీడీఎస్ యు జిల్లా కార్యదర్శి బాశబోయిన వేణు రాజా మాట్లాడుతూ దేశంలోని పేదవర్గాలను ఉన్నత వైద్య విద్యకు దూరం చేసే కుట్రలో భాగంగానే నీట్, యూజీసీ నెట్ పేపర్ల లీకేజీలు జరిగాయని అన్నారు. పేపర్ లీకేజీల వల్ల పేద విద్యార్థులు నష్టపోతున్నా మోడీ ప్రభుత్వం ఇప్పటివరకు ఎందుకు స్పందించ దం లేదని ప్రశ్నించారు. దేశంలో పేపర్ లీకేజీ మాఫియా దోపిడీకి మోడీ ప్రభుత్వం వత్తాసు పలుకుతోందని ఆరోపించారు. నీట్, యూజీసీ నెట్ పేపర్ లీకేజీపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిచే విచారణ జరిపించి దోషులను కఠినంగా శిక్షించాలని, పేపర్ లీకేజీ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నీట్ పరీక్ష నిర్వహణ బాధ్యతలను రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పగించాలని అన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు ఉట్కూరి ప్రణీత్ గౌడ్, నాయకులు కుక్కల కుమార్, వేల్పుల చరణ్, కనర బోయిన రవితేజ, మాచర్ల రాజా గౌడ్, శ్రీపతి వినయ్, ముంజ పూర్ణ ఉప్పుల వినయ్ చారి, మనోజ్, కుమార్, పీడీఎస్ యు యూనివర్సిటీ అధ్యక్ష, కార్యదర్శులు మహేష్, గణేష్, నాయకులు ముషీరఫ్, డానియల్, సుతిన్, ప్రణీత్, గణేష్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

విశ్వ విజేతకు గ్రాండ్ వెల్‌కం

- స్వదేశానికి చేరుకున్న క్రికెట్ జట్టుకు అపూర్వ స్వాగతం
- రోహిత్ సేనకు ప్రధాని మోదీ అభినందనలు
- ముంబైలో విక్టరీ పరేడ్ కు తరలివచ్చిన అభిమానులు

పీఎం మోడీతో ఇండియన్ క్రికెట్ టీం సభ్యులు

అక్షర దర్బార్, న్యూఢిల్లీ: వెస్టిండీస్ గడ్డపై టీ 20 ప్రపంచ కప్ 2024 విజేతగా నిలిచి స్వదేశానికి చేరిన భారత జట్టుకు అపూర్వ స్వాగతం లభించింది. గురువారం ఉదయం ఢిల్లీకి చేరిన రోహిత్ సేనకు అభిమానులు బ్రహ్మరథం పట్టారు. రోహిత్ సేన ఉదయం 11 గంటలకు ప్రధాని మోదీని కలిశారు. విశ్వవేదికపై భారత్‌ను విజేతగా నిలిపిన రోహిత్ సేనను ప్రధాని అభినందించారు. ప్రధానితో కలిసి ప్లేయర్స్ అందరూ అల్పాహారం తిన్నారు. మోదీని కలవడానికి భారత ఆటగాళ్లు స్పెషల్ జెర్సీలో వెళ్లారు. సాయంత్రం ముంబైలో రోహిత్ సేనకు క్రికెట్ అభిమానులు ఘన స్వాగతం పలికారు. వాంకడే స్టేడియంలో నిర్వహించిన విక్టరీ పరేడ్ ను తిలకించేందుకు వేల సంఖ్యలో వచ్చారు. అభిమానులుపెద్ద ఎత్తున తరలివచ్చి సందడిచేశారు.

పెళ్లి కావడం లేదని వ్యక్తి ఆత్మహత్య

అక్షర దర్బార్, తొర్రూరు : పెళ్లి కావడం లేదని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని పత్తేపురం గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. తొర్రూరు ఎస్సై కూచిపూడి జగదీష్ తెలిపిన వివరాల ప్రకారం..పత్తేపురం గ్రామానికి చెందిన కుంభం సంపత్ రెడ్డి (40) అనే వ్యక్తి కొద్ది రోజులుగా వివాహం కావడం లేదని మనస్తాపం చెంది బుధవారం రాత్రి ఇంట్లో కుటుంబ సభ్యులు నిద్రపోతున్న సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన అతడి అన్నయ్య యాకుబ్ రెడ్డి ఆస్పత్రికి తరలించలోపే మృతి చెందాడు. మృతుడి తండ్రి కుంభం ఉప్పల్ రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

తొర్రూరును ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతా

పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

అక్షర దర్బార్,తొర్రూరు: తొర్రూరు మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దుతానని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి అన్నారు. గురువారం తొర్రూరు మున్సిపల్ కార్యాలయంలో సాధారణ సమావేశం నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎక్స్ అఫీషియో మెంబర్ పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి హాజరై మాట్లాడుతూ.. మున్సిపాలిటీలోని వార్డుల వారీగా అభివృద్ధి పనులపై పాలకమండలితో చర్చించామని, ఇప్పటికే రూ.62 కోట్లతో పనులు ప్రారంభమయ్యాయని తెలిపారు. తొర్రూరును ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, తొర్రూరు పట్టణ అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ రెడీ చేయాలని టౌన్ ప్లానింగ్ అధికారిని ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జినుగా సురేందర్ రెడ్డి, మున్సిపల్ ఏఈ రంజిత్, కౌన్సిలర్లు భూసాని రాము, తూణం రోజా, తూర్పాటి సంగీత రవి, పేర్ల యమున జంపా, ధరావత్ సునీత జైసింగ్, నర్సూటి గజానంద్, దొంగరి రేవతి శంకర్, కర్నె నాగజ్యోతి నాగరాజు, కోఆప్షన్ సభ్యులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఐఎన్టీయూసీ ఉమ్మడి జిల్లా చైర్మన్ గా బత్తిని

అక్షర దర్బార్, వరంగల్: ప్రజారోగ్య వైద్య ఉద్యోగుల సంఘం (ఐఎన్టీయూసీ 3194 యూనియన్) ఉమ్మడి వరంగల్ జిల్లా చైర్మన్ గా బత్తిని సుదర్శన్ గౌడ్, కన్వీనర్ గా చాద బుచ్చిరెడ్డిని నియమించినట్లు సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ యన్. శ్యాంసుందర్, జనరల్ సెక్రటరి బొందుగుల వెంకటేశ్వర్ రెడ్డి గురువారం ప్రకటించారు. ఈ సందర్భంగా బత్తిని సుదర్శన్ గౌడ్ మాట్లాడుతూ 25 ఏళ్లుగా వైద్య ఆరోగ్య శాఖలోని అన్ని క్యాడర్స్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తున్నామని చెప్పారు. జిల్లాలో యూనియన్ ని బలోపేతం చేయడానికి చైర్మన్, కన్వీనర్ పదవులు ఇవ్వడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు

CINEMA
గురువారం, జూలై 4, 2024



వెంకీ సినిమా స్టార్ట్

విక్టరీ వెంకటేష్, బ్లాక్ బస్టర్ హిట్ మెషిన్ అనిల్ రావిపూడి వారి కాంబినేషన్లో శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ ప్రొడక్షన్ నెం. 58 కోసం హ్యాట్రిక్ బ్లాక్ బస్టర్లను పూర్తి చేయడానికి సిద్ధంగా ఉన్నారు. రెండు హిలేరియస్ హిట్‌ల` ఈ2, ఈ3 తర్వాత వారు ఒక ఇంట్రస్టింగ్ ప్రాజెక్ట్ కోసం మరోసారి చేతులు కలిపారు. దిల్ రాజు సమర్పణలో శిరీష్ ప్రతిష్టాత్మకంగా నిర్మించనున్న ఈ చిత్రం హైదరాబాద్‌లో అత్యంత గ్రాండ్‌గా ప్రారంభమైంది. ముహూర్తం షాట్‌కు సురేష్ ప్రొడక్షన్స్ నిర్మాత సురేష్ బాబు కెమెరా స్విచాన్ చేయగా, గీతా ఆర్ట్స్ నిర్మాత అల్లు అరవింద్ క్లాప్ కొట్టారు. దర్శకుడు వంశీ పైడిపల్లి స్క్రిప్ట్‌ని మేకర్స్‌కి అందజేశారు. లెజెండరీ డైరెక్టర్ రాఘవేంద్రరావు గౌరవ దర్శకత్వం వహించారు. ఈ న్యూ మూవీ హీరో, అతని ఎక్స్ గర్ల్ ఫ్రెండ్, అతని ఎక్స్‌లెంట్ వైఫ్.. ఈ మూడు పాత్రల చుట్టూ తిరిగే ఎక్స్ ట్రార్డినరీ ట్రయాంగిల్ క్రైమ్ ఎంటర్‌టైనర్. ఈ చిత్రంలో వెంకటేష్ సరసన మీనాక్షి చౌదరి, ఐశ్వర్య రాజేష్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఈ ముగ్గురూ ఇప్పటికే రెండు బ్లాక్‌బస్టర్‌లను అందించిన నేపథ్యంలో, వారి కాంబినేషన్‌లో మరో చిత్రం కోసం సినీ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ప్రేక్షకులు మునుపెన్నడూ లేని అనుభూతిని అందించడానికి టాప్ టెక్నీషియన్స్ ఈ సినిమా కోసం పని చేస్తున్నారు.

శరవేగంగా విశ్వంభర షూటింగ్

మెగాస్టార్ చిరంజీవి ప్రస్తుతం వశిష్ఠ దర్శకత్వంలో విశ్వంభర సినిమాను చేస్తున్న విషయం తెల్సిందే. వచ్చే ఏడాది సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకు రాబోతున్న ఈ సినిమాకు సంబంధించిన మ్యూజిక్ సిట్టింగ్స్ జరుగుతున్నాయి. అందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం వైరల్ అవుతోంది. చిరంజీవి వీడియోను షేర్ చేయడంతో పాటు కీరవాణికి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేశాడు. యూవీ క్రియేషన్స్ బ్యానర్‌పై దాదాపు రూ.200 కోట్ల భారీ బ్జడెట్‌తో 'విశ్వంభర' తీర్చిదిద్దుతున్నట్లు టాక్. చిరంజీవి కెరీర్‌లోనే అత్యధిక బడ్జెట్‌తో రూపొందుతున్న సినిమాగా ఇది నిలిచిపోనుంది.

అంధధూన్ రీమేక్

ఆరేండ్ల క్రితం బాలీవుడ్‌లో వచ్చి సంచలన విజయం సాధించిన చిత్రం 'అంధధూన్' దానిని ఇప్పటికే తెలుగు, మలయాళ, కన్నడ సినిమాల్లో రీమేక్ చేసి విడుదల కూడా చేశారు. అయితే అదే సమయంలో తమిళంలోనూ ప్రశాంత్ హీరోగా 'అందగన్' పేరుతో మొదలు పెట్టారు. ప్రశాంత్ తండ్రి ప్రముఖ డైరెక్టర్ త్యాగరాజన్ తన సొంత నిర్మాణ సంస్థ స్టార్ మూవీస్ పతాకంపై నిర్మిస్తూ, దర్శకత్వం వహించారు. అయితే చాలాకాలం తర్వాత ఈ సినిమా నుంచి అప్డేట్ వచ్చింది. తాజాగా ఈ చిత్రాన్ని ఆగస్టులో విడుదల చేయనున్నట్టు అధికారికంగా ప్రకటించారు. అయితే, విడుదల తేదీపై మాత్రం స్పష్టత ఇవ్వలేదు. ఈ 'అందగన్' చిత్రంలో హిందీలో ఆయుష్మాన్ ఖురానా పోషించిన పాత్రను ప్రశాంత్ చేస్తుండగా రాధికా ఆప్టే పాత్రలో ప్రియా ఆనంద్ టబు పాత్రను సిమ్రాన్ చేస్తుండగా ఇతర ముఖ్య పాత్రల్లో కార్తీక్, యోగిబాబు, ఊర్వశి, కేఎస్ రవికుమార్, మనోబాలా, వనిత విజయకుమాన్, సెమ్మలర్, పూవైయార్ తదితరులు నటించారు. రవియాదవ్ ఛాయాగ్రహణం అందించిన ఈ చిత్రానికి సంతోష్ నారాయణన్ సంగీతం సమకూర్చారు. ఇదిలాఉండగా ఈ సినిమా షూటింగ్ 2021 జూన్‌లోనే పూర్తయింది. కానీ, పలు కారణాలతో ఈ సినిమా విడుదలలో తీవ్ర జాప్యం నెలకొంది. సంక్రాంతికి ఈ చిత్రం పోస్టర్‌ను విడుదల చేయగా, ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వచ్చింది. ఈ నేపథ్యంలో ఈ సినిమాను ఆగస్టులో విడుదల చేయనున్నట్టు ప్రకటించారు. కాగా, అగ్ర హీరో విజయ్ నటించిన 'ది గోట్' చిత్రంలో ప్రశాంత్ ఓ ముఖ్య పాత్రను పోషించగా ఈ చిత్రం సెప్టెంబరులో విడుదల కానుంది.

నివేదా..35 చిన్నకథ కాదు

నిన్నుకోరి, జై లవకుశ, వకీల్ సాబ్, శాకినీ డాకినీ సినిమాలతో తెలుగు ప్రేక్షకులను మెప్పించిన నివేదా థామస్ ఈ మధ్య కాలంలో కాస్త సినిమాలను తగ్గించింది. తాజాగా '35 చిన్న కథ కాదు' సినిమాలో నటించింది. ఆ సినిమాకి సంబంధించిన పోస్టర్ ను విడుదల చేసిన సమయంలో సోషల్ మీడియాలో రకరకాలుగా పుకార్లు షికార్లు చేశాయి. సినిమాలో నివేదా భార్యగా, తల్లిగా కనిపించబోతుంది. అందుకు సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియా ద్వారా చిత్ర యూనిట్ సభ్యులు షేర్ చేయడంతో చాలా మంది కూడా నివేదా పెళ్లి అయ్యిందని, ఇతడే భర్త అన్నట్లుగా ప్రచారం చేశారట. ఆ విషయాన్ని నివేదా తాజా కార్యక్రమంలో చెప్పుకొచ్చింది. ఈ సినిమా ప్రమోషన్ లో భాగంగా సోషల్ మీడియాలో షేర్ చేసిన ఒక ఫొటోను చూసి చాలా మంది నాకు పెళ్లి అయ్యిందని ప్రచారం చేశారు. ఆ విషయాలను మా అమ్మ నా వద్దకు తీసుకువచ్చింది. అమ్మ ఆ ఫొటోలను నాకు పంపించింది. నాకు మీరు ఎప్పుడు సంబంధం చూశారు అన్నాను. ఈ సినిమాలో విశ్వదేవ్ కి భార్యగా నివేదా థామస్ నటించింది. అతడిని చూపిస్తూ నాకు పెళ్లి అయ్యింది, ఇతడే నా భర్త, వీళ్లు ఇద్దరు నా పిల్లలు అంటూ సరదాగా వ్యాఖ్యలు చేసింది. తిరుపతి నేపథ్యంలో సాగే ఈ సినిమాను రానా సమర్పిస్తున్నాడు. నంద కిషోర్ ఇమాని దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమా లో నివేదా నటన సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తుందని చిత్ర యూనిట్ సభ్యులు అంటున్నారు.

జీబ్రాలో సత్య డిఫరెంట్ రోల్

టాలీవుడ్ నటుడు సత్యదేవ్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'జీబ్రా' సినిమాకు ఈశ్వర్ కార్తీక్ దర్శకత్వం వహిస్తున్నాడు. ఇప్పటికే ఈ సినిమా నుంచి వచ్చిన మోషన్ పోస్టర్ అందరిని ఆకట్టుకుంది. ఇదిలావుంటే సత్యదేవ్ పుట్టినరోజు సందర్భంగా మూవీ నుంచి బర్త్ డే విషెస్ తెలుపుతూ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు మేకర్స్. ఈ మూవీలో సత్య సూర్య అనే పాత్రలో కనిపించబోతున్నాడు. యాక్షన్ క్రైమ్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రం ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో బిజీగా ఉంది. త్వరలోనే ఈ సినిమా విడుదల తేదీని ప్రకటించనున్నట్లు మేకర్స్ తెలిపారు. ఈ చిత్రంలో సత్యదేవ్‌కు జోడీగా ప్రియా భవానీ శంకర్ నటిస్తుంది. పుష్పా సినిమాతో ఫేమస్ అయిన ధనంజయ (జాలిరెడ్డి) ఈ సినిమాలో కీలకపాత్ర పోషిస్తున్నాడు. కాగా ఈ చిత్రాన్ని ఓల్డ్ టౌన్ పిక్చర్స్, పద్మ ఫిలిమ్స్ బ్యానర్‌పై ఎస్ఎన్ రెడ్డి, బాలసుందరం, దినేష్ సుందరం సంయుక్తంగా నిర్మిస్తున్నారు.